క్లుప్తంగా

35 మద్యం బాటిళ్లు పట్టివేత

బేస్తవారిపేట: మండలంలోని చిన్న ఓబినేనిపల్లెలో బెల్ట్ షాపు నిర్వహిస్తున్న ఒకరిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై ఎస్వీ రవీంద్రారెడ్డి శుక్రవారం తెలిపారు. బెల్ట్‌షాపులో నిల్వ చేసిన 35 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు.

బెల్టుషాపుపై దాడి

కంభం: మండలంలోని చిన్నకంభంలో బెల్టు షాపుపై ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు దాడి చేసి పి. తిరుపతయ్య అనే వ్యక్తిని అదుపులోనికి తీసుకొని 20 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ ఎస్సై కొండారెడ్డి మాట్లాడుతూ ఎవరైనా బెల్టు షాపులు నిర్వహించినా, అక్రమంగా మద్యం తరలించినా, అక్రమ మద్యం కలిగి ఉన్నా, అమ్మినా చట్టరీత్యా నేరమన్నారు. అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రాష్ట్రస్థాయి షటిల్ పోటీలకు ఎంపికైన కీర్తిలాస్య



పీఈటీతో విద్యార్థిని కీర్తిలాస్య

బేస్తవారిపేట: స్థానిక జెడ్పీ బాలికల హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని ఎల్ కీర్తిలాస్య జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో సత్తాచాటారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో చీరాలలో జరుగుతున్న జిల్లా స్థాయి పోటీల్లో షటిల్ సింగిల్స్ విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఈనెల 28న రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీలకు కీర్తిలాస్య ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పీఈటీ ఉమామహేశ్వరిని, విద్యార్థినిని హెచ్ఎం కర్నాటి తిరుపతిరెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

సత్తాచాటిన బాలుర హైస్కూల్ విద్యార్థి



పీడీతో విద్యార్థి రవీంద్ర

బేస్తవారిపేట: స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్ విద్యార్థి బీవీ రవీంద్ర జిల్లా స్థాయి ఆటల పోటీల్లో సత్తాచాటాడు. కందుకూరు టీఆర్ఆర్ కళాశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో 800 మీటర్ల పరుగు పందెంలో మొదటి స్థానంలో నిలిచాడు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్ ఎస్ మధుసూదనాచారులు తెలిపారు. ఈ సందర్భంగా పీడీని, విద్యార్థిని హెచ్ఎం ఎంఎస్ శర్మ, ఉపాధ్యాయులు అభినందించారు.

రైతులకు శనగ విత్తనాలు పంపిణీ

గిద్దలూరు రూరల్: పట్టణంలోని మార్కెట్ యార్డు ఆవరణలో స్థానిక సహాయ వ్యవసాయ సంచాలకులు డి.బాలాజీనాయక్ ఆధ్వర్యంలో శుక్రవారం రైతులకు 25 శాతం సబ్సిడీతో శనగ విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రైతులు సబ్సిడీ విత్తనాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ పాముల వెంకట సుబ్బయ్య, జెడ్పీటీసీ బుడత మధుసూదన రావు, ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి సోదరుడు కృష్ణకిషోర్‌రెడ్డి, వ్యవసాయశాఖ ఏఓ విజయభాస్కర్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణాలను నిలబెడుతుంది



రక్తదానం చేస్తున్న రక్తదాతలు

గిద్దలూరు రూరల్: రక్తదానం ఆపదలో ఉన్న వారి ప్రాణాలను నిలబెడుతుందని సీఐ కె.సురేష్ యాదవ్ అన్నారు. పోలీసు అమరవీరుల వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో శుక్రవారం మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం పై ప్రజలల్లో కొన్ని అపోహలు ఉన్నాయని, వాటిని తొలగించుకుని ప్రతి ఒక్కరూ రక్తదానం చేసేందుకు సిద్ధంగా ఉండాలని కోరారు. రక్తదానం చేసిన పలువురు జర్నలిస్టులను, 83 సార్లు రక్తదానం చేసిన దప్పిలి వినోద్‌కుమార్‌రెడ్డిని ప్రత్యేకంగా అభినందించారు. మొత్తం 141 మంది రక్తదానం చేసినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో గిద్దలూరు రూరల్ సీఐ రామకోటయ్య, ఎమ్మెల్యే సోదరుడు క్రిష్ణకిషోర్‌రెడ్డి, బీజేపీ నాయకుడు పిడతల రమేష్‌రెడ్డి, పోలీసు సిబ్బంది, పాల్గొన్నారు.

గోగినేనివారిపాలెంలో పారిశుధ్య పనులు

పొదిలి రూరల్: పొదిలి మండలం ఉప్పలపాడు పంచాయతీ గోగినేనివారిపాలెంలో శుక్రవారం పారిశుధ్య పనులు చేపట్టారు. ముఖ్యంగా సైడు కాలువల్లో పేరుకుపోయిన జంగిల్‌ను తొలగించి చెత్తచెదారాన్ని తీసివేసి కాలువల్లోని మురుగును బయటకు పంపి శుభ్రం చేశారు. ఎటువంటి అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తుగా వీధుల్లో సోడియం హైపోక్లోరైడ్ ద్రావణాన్ని పిచికారీ చేశారు. కాలువల్లో తొలగించిన మురుగును ట్రాక్టర్లతో వెంటనే బయటకు పంపారు. సర్పంచ్ గుంటూరి యేసేబు, పంచాయతీ కార్యదర్శి శేషగిరి ఉన్నారు.

వెలుగుతున్న నిర్లక్ష్యం



గిద్దలూరు నగర పంచాయతీ కార్యాలయం



పగటి పూట వెలుగుతున్న వీధి లైటు

- పట్టపగలు వెలుగుతున్న వీధిలైట్లు
- అధికారుల నిర్లక్ష్యానికి విద్యుత్ వృథా
- విద్యుత్ శాఖకు రూ.కోట్లలో బకాయి

గిద్దలూరు రూరల్: నగర పంచాయతీ పరిధిలో సుమారు 500 విద్యుత్ స్తంభాలకు ఉన్న వీధి లైట్లు పగటి పూట వెలుగుతుండటంతో విద్యుత్ వృథా అవుతోంది. పాములపల్లె, చట్టిరెడ్డిపల్లె, మోడంపల్లె, శ్రీరామ్‌నగర్, నల్లబండబజారు, పీఆర్.కాలనీ, అర్బన్‌కాలనీ, రాజానగర్ వీధుల్లో విద్యుత్ స్తంభాలకు ఉన్న వీధిలైట్లు ఎక్కువగా రాత్రులతోపాటుగా పగటి పూట సైతం వెలుగుతూ విద్యుత్ వృథా అవుతోంది. విద్యుత్ స్తంభాలకు ఉండే వీధిలైట్లకు సంబంధించి అదనంగా విద్యుత్‌శాఖ వారికి నగదు చెల్లించాల్సి ఉంది. అలా కాకుండా నగర పంచాయతీ వారు విద్యుత్ శాఖ వారికి వీధిలైట్లకు అదనపు తీగ కోసం ఎస్టిమేట్స్ వేసి పంపకుండా దానికి నగదు చెల్లించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో కూడా వీధిలైట్లు పగటి పూట వెలుగుతున్నాయని విద్యుత్‌శాఖ అధికారులు చెబుతున్నారు. దీని వల్ల విద్యుత్ ఎక్కువ మొత్తంలో వృథా అవుతోందని తెలుస్తోంది. త్రీఫేస్ విద్యుత్ తీగలు ఉన్న స్తంభాలకు వీధిలైట్లు రాత్రి పూట వెలుగుతూ పగటి పూట ఆరిపోతుంటాయి. ఇది ఇలా ఉండగా నగర పంచాయతీ వారు వీధిలైట్లకు సంబంధించి ప్రతి నెలా రూ.1.50 లక్షలు, నీటి బోర్లకు సంబంధించి నెలకు రూ.16.50 లక్షల విద్యుత్ బిల్లు వస్తుంది.

రూ.కోట్లలో విద్యుత్ బకాయిలు

నగర పంచాయతీ విద్యుత్ శాఖకు చెల్లించాల్సిన బకాయిలు కోట్లలో పెండింగ్‌లో ఉన్నాయి. నగర పంచాయతీ పరిధిలోని 160 నీటి బోర్లు, గుండ్లమోటు వద్ద 15 బోర్లు, నగర పంచాయతీ కార్యాలయం, సచివాలయం కార్యాలయాలకు, వీధి లైట్లకు సంబంధించి విద్యుత్ బకాయిలు మొత్తం ఇప్పటి వరకు రూ.4.55 కోట్ల బకాయి ఉంది. ఈ సంవత్సరం గత మార్చి నెల రూ.3 లక్షలు చెల్లించి ఇప్పటి వరకు విద్యుత్ బకాయిలు చెల్లించలేదు.

వ్యాధి సోకిన పంటలను యాప్‌లో నమోదు చేయాలి



క్షేత్రపరిశీలన చేస్తున్న అధికారులు

బేస్తవారిపేట: తెగుళ్లు సోకిన పంటల ఫొటోలను యాప్‌లలో అప్‌లోడ్ చేయడంపై అవగాహన పెంచుకోవాలని జిల్లా వనరుల కేంద్రం సమన్వయకర్త ఎస్ రామమోహన్ అన్నారు. మండలంలోని సలకలవీడులో శంకర్‌రెడ్డి ఫార్మసీ కళాశాలలో శుక్రవారం మార్కాపురం, గిద్దలూరు వ్యవసాయశాఖ సబ్‌డివిజన్ పరిధిలోని రైతు సేవా కేంద్రం సిబ్బంది, ఏఈఓలు, ఏఓలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. క్షేత్ర స్థాయిలో పంటలను పరిశీలించినప్పుడు సీఎల్ఎస్-పీడీఎస్ఎస్, ఎన్‌పీఎస్ఎస్ యాప్‌లలో వ్యాధి సోకిన పంట ఫొటోలు అప్‌లోడ్ చేయాలన్నారు. శాస్త్రవేత్తలు వ్యాధులను పరిశీలించి సలహాలు, సూచనలు ఇస్తారన్నారు. గిద్దలూరు, మార్కాపురం వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు డీ బాలాజీనాయక్ మాట్లాడుతూ వ్యవసాయశాఖ నుంచి అందే పథకాలు, సాంకేతిక సమాచారం రైతులకు తెలపాలని, రైతు సేవా కేంద్రం సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండాలని కోరారు. గ్రామంలోని పంట పొలాలను సందర్శించారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త టీ వెంకటేశ్వరరెడ్డి, జిల్లా వనరుల కేంద్రం ఏఓ వీవీ శేషమ్మ, ఏఓలు పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంఈఓ-2 సుబ్బారావు

తర్లుపాడు: మండలంలోని లింగారెడ్డి కాలనీ ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ 2 అచ్యుత సుబ్బారావు శుక్రవారం తనిఖీ చేశారు. అకడమిక్ క్యాలండర్ ప్రకారం సిలబస్ పూర్తిచేసి విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయాలని హెచ్ఎం మౌలాలికి సూచించారు. అపార్ ఐడీ కార్యక్రమాలను నేటిలోపు పూర్తి చేయాలని ఆదేశించారు. పాఠశాలకు సొంత భవనం లేని విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియచేస్తానన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు.

వివాదాస్పద భూముల సర్వే



భూములను సర్వే చేస్తున్న తహసీల్దార్ చిరంజీవి

మార్కాపురం రూరల్: పట్టణ పరిధిలో ఉన్న దళితుల భూములను తహసీల్దార్ చిరంజీవి శుక్రవారం పరిశీలించారు. కొన్నేళ్లుగా ఈ భూములు తమ పూర్వీకులవని, అయితే 2014 నుంచి 2019 మధ్య కాలంలో టీడీపీ నాయకులు ఆన్‌లైన్‌లో తమ పేర్లు మార్చుకున్నారని దళిత సంఘ నేత ఐజక్ ఆరోపిస్తూ అధికారులకు ఫిర్యాదు చేశారు. సర్వే నంబర్ 1475లో ఉన్న 41.50 ఎకరాల భూమిని మార్కాపురం తహసీల్దార్, మండల సర్వేయర్ సంజీవయ్య సమక్షంలో సర్వే చేశారు. శనివారం జేసీ కోర్టులో విచారణకు ఇరువర్గాలు హాజరు కావాలని తహసీల్దార్ తెలిపారు. ఈ సందర్భంగా ఐజక్ మాట్లాడుతూ సర్వే నంబర్ 1475 నుంచి 1485 వరకూ దళితులకు డిప్రెస్ క్లాస్ షరతుల కింద ఈ భూములను కేటాయించారని, అప్పటి నుంచి ఇప్పటి వరకూ భూమిపై హక్కుదారులుగా తామే ఉన్నామని, పత్తి, కంది పంటలు సాగు చేస్తున్నామని చెప్పారు. పట్టణానికి చెందిన టీడీపీ నేత 1994లో కృష్ణా జిల్లాకు చెందిన వారితో కుమ్మక్కై దొంగ డాక్యుమెంట్లు సృష్టించి డాక్యుమెంట్ల ఆధారంగా మాపై దాడులు చేశారన్నారు. దళిత భూములపై టీడీపీ నేతలు కన్నేయడం బాధాకరమన్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారులకు, టీడీపీ పెద్దలకు, నాయకులకు ఫిర్యాదు చేస్తామని చెప్పారు. ఇరుపార్టీల నేతలు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకోవడంతో అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకుకుండా మార్కాపురం ట్రాఫిక్ ఎస్సై అహరోన్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

పాఠశాలకు ప్రింటర్ బహూకరణ



ప్రింటర్ అందిస్తున్న పూర్వ విద్యార్థులు

మార్కాపురం రూరల్: మండలంలోని గజ్జలకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు 2008-09 పదో తరగతి పూర్వవిద్యార్థులు 20 వేల రూపాయలు విలువ చేసే ప్రింటర్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డి.రామాంజనేయరెడ్డికి అందజేశారు. పూర్వ విద్యార్థులు సాధం వీరనారాయణ, వి.నాగాంజయ్య, ఐ.సాయిలోకేష్, నారు బాపన్‌రెడ్డి, జె.చిన్న నాసరయ్య, వై.నాగేశ్వరరావులు పాఠశాలకు ప్రింటర్‌ను అందించారు. వీరందరినీ ప్రధానోపాధ్యాయుడు అభినందించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి పూర్వవిద్యార్థులందరూ సహకరించాలని కోరారు.

కరివెన సత్రం అభివృద్ధికి సహకరిస్తా

- అఖిల భారత కరివెన సత్రాల సలహాదారు జగన్నాథ్



జగన్నాథ్‌ను సన్మానిస్తున్న హరిహరరావు తదితరులు

మార్కాపురం: అఖిల భారత కరివెన సత్రాల అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని సలహాదారునిగా నియమితులైన జాతీయ సైన్సు అవార్డు గ్రహీత టీ జగన్నాథ్ అన్నారు. మార్కాపురం పట్టణంలోని వివిధ బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు శుక్రవారం ఆయనను ఘనంగా సన్మానించి వేద ఆశీర్వచనం అందించారు. జగన్నాథ్ మాట్లాడుతూ బ్రాహ్మణులందరూ ఐకమత్యంగా ఉండాలని సూచించారు. సత్రాల అభివృద్ధికి దాతల సహకారం అవసరమని కోశాధికారి గోపాలుని హరిహరరావు అన్నారు. కార్యక్రమంలో వివిధ బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులైన ప్రముఖ న్యాయవాది పురాణం సుబ్రహ్మణ్యం, ఎన్జీవో అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ శ్రీనివాసశాస్త్రి, శివాలయం మాజీ చైర్మన్ కేశవశర్మ, ఆడిటర్ నాగరాజు, భజరంగ్‌దళ్ నాయకులు కే రామకృష్ణ, సాధనా విద్యా సంస్థల డైరెక్టర్ జీఎల్ రమేష్‌బాబు, నారాయణచార్యులు, ఎక్స్ సర్వీస్‌మెన్ అసోసియేషన్ నాయకులు శేషసాయి, ఎస్ రామకృష్ణ, కమలాపురి శ్రీనివాస్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కార్తీక మాసం సందర్భంగా ప్రత్యేక బస్సులు

- నేడు డయల్ యువర్ డీఎం



ఆర్టీసీ డీఎం నరసింహులు

మార్కాపురం: కార్తీక మాసం సందర్భంగా వచ్చే నెల 2వ తేదీ నుంచి ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ డీఎం నరసింహులు శుక్రవారం తెలిపారు. నెలరోజుల పాటు శ్రీశైలం, అరుణాచలంతో పాటు మన రాష్ట్రంలోని పంచారామాలకు కూడా ఈ ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు చెప్పారు. ప్రయాణికులు ముందే రిజర్వేషన్ చేయించుకోవచ్చున్నారు. అదనపు బస్సులు కూడా ఏర్పాటు చేస్తున్నామని, ప్రస్తుతానికి 150 బస్సులను కార్తీక మాసం సందర్భంగా రాష్ట్రంలోని వివిధ పుణ్యక్షేత్రాలకు నడిపేందుకు నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

నేడు డయల్ యువర్ డీఎం

మార్కాపురం ఆర్టీసీ డిపో పరిధిలో శనివారం సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకూ డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ నరసింహులు తెలిపారు. ప్రయాణికులకు ఏవైనా సమస్యలుంటే 99592 25699 నంబరుకు ఫోన్‌చేసి తెలపవచ్చని వారి సమస్యలను పరిష్కరిస్తారన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



విద్యార్థులు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

కొనకనమిట్ల: పోలీస్ అమరవీరుల వారోత్సవాల సందర్భంగా శుక్రవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఎస్ఐ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు వ్యాచరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. సైబర్ నేరాలపై అవగాహన, నియంత్రణలో యువత పాత్ర అనే అంశాలపై పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రాజ్‌కుమార్ మాట్లాడుతూ చదువుకున్న ప్రతి ఒక్కరూ సమాజం, నేరాల గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం పోలీస్ స్టేషన్‌ను విద్యార్థులు సందర్శించి స్టేషన్ పరిసరాలు గమనించారు.

రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి..

రౌడీషీటర్లు నేర ప్రవృత్తిని విడనాడి సత్ప్రవర్తనతో మెలగాలని ఎస్ఐ రాజ్‌కుమార్ సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో పలువురు రౌడీషీటర్లకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. బెయిల్‌పై బయట ఉన్నవారు మళ్లీ నేరాలకు, గొడవలకు పాల్పడితే బెయిల్ రద్దయ్యే అవకాశం ఉందన్నారు.

దేవాలయాల అభివృద్ధికి కృషి

- నూతన ఈఓ లీలాకృష్ణ



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న లీలాకృష్ణ

పొదిలి రూరల్: దేవదాయశాఖకు సంబంధించిన ప్రతి దేవాలయాన్ని అభివృద్ధి చేసేందుకు తనవంతు కృషి చేస్తానని ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బీ లీలాకృష్ణ చెప్పారు. పొదిలి పార్వతీదేవి సమేత నిర్మమహేశ్వరస్వామి దేవస్థానం నూతన ఈఓ గా శుక్రవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ముందుగా ఇక్కడ పని చేస్తున్న శ్రీనివాసరావు బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో లీలాకృష్ణ ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలు సమర్పించి బాధ్యతలు చేపట్టారు. ఈయనకు శ్రీనివాసరావు ఆలయానికి సంబంధించిన రికార్డులు అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో చారిత్రక వైభవం కలిగిన పొదిలి నిర్మమహేశ్వరస్వామి, పొదిలికొండ లక్ష్మీనరసింహస్వామి, పొదిలమ్మ, వేణుగోపాలస్వామి తదితర దేవాలయాలను అభివృద్ధి చేసేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. ఆలయ పరిసరాల్లో నీటి వసతితో పాటు, ఇతర అభివృద్ధి పనులు చేసేందుకు అవసరమైన ప్రణాళికలు తయారు చేసి ఉన్నతాధికారులకు పంపుతామన్నారు. ఈయన ఇప్పటి వరకు మద్దిపాడులో పని చేస్తూ ఇక్కడి బదిలీపై వచ్చారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



మాట్లాడుతున్న పెద్దారవీడు ఎస్సై అనిల్‌కుమార్

మార్కాపురం టౌన్: పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు శుక్రవారం నిర్వహించారు. పెద్దారవీడు ఎస్సై అనిల్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి సమాజాభివృద్ధికి పాటుపడాలని కోరారు. విధినిర్వహణలో అమరులైన వారి త్యాగాల గురించి వివరించారు. రోల్ ఆఫ్ యూత్ ఇన్ ప్రివరేషన్ ఆఫ్ సైబర్ క్రైమ్ అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ అన్నా కృష్ణచైతన్య, ఎన్ఎస్ఎస్ యూనిట్ అధికారి పి.అనిల్, 50 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

లైట్లు వెలిగేనా?



రాయవరం వద్ద హైవేపై వెలగని వీధి దీపాలు

మార్కాపురం రూరల్: మార్కాపురం మండలం రాయవరం వద్ద జాతీయ రహదారి 565పై ఏర్పాటు చేసిన వీధిలైట్లు ఎప్పుడు వెలుగుతాయోనని ప్రజలు ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. నిత్యం వేలాది వాహనాలు తిరుగుతన్న ఈ జాతీయ రహదారిపై చిమ్మ చీకట్లోనే ప్రయాణం చేయాల్సి వస్తోంది. వీధిలైట్లు వెలగక పోవడంతో వాహనదారులు, గ్రామస్తులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మార్కాపురం-రాయవరం హైవేపై ఉన్న వీధిలైట్లకు మరమ్మతులు చేసి వెలిగేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

జీజీహెచ్‌ను తనిఖీ చేసిన సబ్ కలెక్టర్



జీజీహెచ్‌లో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ త్రివినాగ్

మార్కాపురం: స్థానిక జీజీహెచ్ (సర్వజన ఆస్పత్రి)ని శుక్రవారం రాత్రి సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వివిధ వార్డులను తనిఖీ చేసి రోగులతో మాట్లాడి వైద్య సేవలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. రెండు రోజుల్లో ఆడ పిల్లలను ప్రసవించిన తల్లిదండ్రులతో ప్రత్యేకంగా మాట్లాడారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ సావిత్రితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆడపిల్లలను ప్రసవించిన కుటుంబానికి 10 వేల రూపాయల ఆర్థిక సాయం అందిస్తున్నట్లు సబ్ కలెక్టర్ త్రివినాగ్ తెలిపారు.

కార్మికుల తొలగింపు అన్యాయం



మాట్లాడుతున్న అబ్దుల్ రజాక్

మార్కాపురం టౌన్: మున్సిపల్ కార్యాలయంలో కాంట్రాక్టు ఉద్యోగులుగా పనిచేస్తున్న కార్మికులను తొలగించడం అన్యాయమని ఎంపీజే రాష్ట్ర అధ్యక్షుడు షేక్ అబ్దుల్ రజాక్ అన్నారు. శుక్రవారం 11వ రోజు దీక్షలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్మికులను తొలగింపు విషయంలో కార్మిక చట్టాలను నియమ నిబంధనలను పాటించకుండా తొలగించడం అన్యాయమన్నారు. సుమారు 20 ఏళ్లుగా పనిచేస్తున్న కార్మికులను తొలగించడంతో వారితో పాటు వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్, జిల్లా కార్యదర్శి డీకేఎం రఫీ, ఎంపీజే జిల్లా అధ్యక్షుడు షేక్ ఖాశీం, నాయకులు నాగూర్ మీరావలి, వలి, అబ్బాస్, అమీర్, ఖాశీం, మున్సిపల్ కాంట్రాక్టు కార్మికుల యూనియన్ నాయకులు సుబ్బరాయుడు, హరి, ఇమాంసా, సుబ్బారెడ్డి, కనకయ్య, అబ్దుల్ సలాం, శ్రీను పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

మార్కాపురం టౌన్: స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా పోటీల్లో పట్టణంలోని వాసవీ విద్యానికేతన్ విద్యార్థిని సీహెచ్ హేమలత రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం ఎ.రంగయ్య శుక్రవారం తెలిపారు. చీరాలలో జరిగిన జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ అండర్-14 విభాగంలో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినిని ఏఓ రంజిత్, పీఈటీ అంజనేయులు, లాజర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

చిల్లకంపతో చిక్కు

- ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు
- రైతులకు తప్పని ఇబ్బందులు



లక్ష్మక్కపల్లి రోడ్డుపైకి అల్లుకున్న చిల్లచెట్లు



మూసుకుపోయిన తర్లుపాడు-తుమ్మలచెరువు రోడ్డు

తర్లుపాడు: మండలంలోని పలు గ్రామాల్లో రహదారుల వెంబడి చిల్లచెట్లు రోడ్డుకు అడ్డంగా పెరిగి వాహనదారులు, ప్రజలకు ప్రమాదకరంగా మారాయి. రహదారుల వెంట ప్రయాణించే వారు గాయాలపాలై ఇబ్బందులు పడుతున్న సంఘటనలు అనేకం ఉన్నాయి. ప్రధానంగా మండల కేంద్రం తర్లుపాడు-తుమ్మలచెరువు, నాగేళ్లముడుపు -చెన్నారెడ్డిపల్లి, కొండారెడ్డిపల్లి-వెలుగొండ, మంగలకుంట-ఓబాయపల్లె, తాడివారిపల్లి-నాగెళ్లముడపు, కేతగుడిపి-సూరేపల్లి, కొండారెడ్డిపల్లి- కలుజువ్వలపాడుకు వెళ్లే రహదారుల్లో చిల్లకంప అడ్డంగా పెరిగి రహదారిని ఆక్రమించింది. గ్రామాల్లోని లింకు రోడ్లు, వ్యవసాయ భూములకు వెళ్లే గ్రావెల్ రోడ్డుకు ఇరువైపులా చిల్లకంపతో మూసుకుపోయాయి. దీనికి తోడు ఎదురుగా వస్తున్న ప్రయాణికులు వాహనాలను గమనించలేక యాక్సిడెంట్‌లకు గురై ప్రమాదాల బారిన పడుతున్నారు. మండలంలో రైతులు 80 శాతం వ్యవసాయ పనులు చేసి జీవనం సాగిస్తున్నారు. నిత్యం రైతులు పొలాలకు ఈ రోడ్ల మీదుగానే వెళ్లాలి. వర్షాలు కురుస్తుండటంతో రాత్రి పూట అడవిపందులు రోడ్డు పక్కన పొదల్లోంచి అకస్మాత్తుగా రహదారిపై వస్తుండటంతో వాహనదారులు గమనించలేక ప్రమాదాలకు గురై గాయాల పాలవుతున్నారు. ఇటీవల కొందరు గాయపడిన సంఘటనలు చోటుచేసుకున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపులా, రహదారికి అడ్డంగా ఉన్న చిల్లచెట్లను తొలగించాలని వాహనదారులు, ప్రజలు, రైతులు కోరుతున్నారు.